

భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ప్రసాద్ కుమార్ తదితరులు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

నార్సింగ్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం, బండ్లగూడ మున్సిపాలిటీ నూతన భవనాన్ని, గండిపేట మండలంలో నాలుగు ఓవర్‌హెడ్ రిజర్వాయర్లను రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటోందని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల విమర్శలను స్థానిక ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ ఖండించాలని ఆయన సూచించారు. అనంతరం గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. కిస్మత్‌పూర్‌లో సుమారు రూ.12.55 కోట్లతో మున్సిపల్ భవనాన్ని పూర్తి చేశామన్నారు. హిమాయత్‌సాగర్ వద్ద వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను రూ.22 కోట్లతో మూడు మంచినీటి శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ దినదినాభివృద్ధి చెందుతోందని ఆయన కొనియాడారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కలెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర, మాజీ మేయర్‌లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘాలు సమస్యలపై దృష్టిసారించాలి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బస్తీ సంక్షేమ సంఘాలు సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్‌లోని నివాసంలో సింగాడికుంట బస్తీ ఎన్నికల్లో గెలిచిన అధ్యక్షుడు జువ్వాది అనిల్‌కుమార్, ఎస్ఎన్.మూర్తి తదితరులు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బస్తీలోని సమస్యలను దానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే బస్తీలో పర్యటించి, వాటి పరిష్కారం కోసం నిధులు కేటాయిస్తానని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా బస్తీలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని స్థానికులు అడుగుతున్నారని, తన నిధుల నుంచి కోటి రూపాయలను కేటాయించనున్నట్టు తెలిపారు.

యూపీఎస్‌సీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్‌సీ కంబైండ్ ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లు, స్థానిక అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 803 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈనెల 9న ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలుంటాయన్నారు. పరీక్ష నిర్వహణ కోసం లోకల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లను నియమించామని, అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కాలిక్యులేటర్లు, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ లాంటివి తీసుకురావద్దని సూచించారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఐఫోన్ అమ్మకం.. సినీ ఫక్కీలో రూ.75 వేల మోసం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి ఐ ఫోన్ అమ్మకానికి ఓఎల్ఎక్స్‌లో పెట్టాడు...కానీ మరో వ్యక్తి 'యాడ్ పెట్టింది నేనే' అని సినీ ఫక్కీలో రూ.75 వేలు మోసం చేశాడు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 2కు చెందిన శంకర్ అగర్వాల్ వ్యాపారి. జనవరిలో ఓఎల్ఎక్స్‌లో ఐఫోన్16 ప్రో మాక్స్ అమ్మకానికి ఉండటం గమనించాడు. వెంటనే అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కు కాల్ చేశాడు. కిరణ్ అనే వ్యక్తి లైన్‌లోకి వచ్చి రూ.75 వేలకు అమ్మకానికి ఒప్పుకున్నాడు. జనవరి 8న తన సోదరుడితో ఫోన్‌ను జింఖానా క్లబ్ వద్దకు పంపిస్తానని, పరిశీలించి డబ్బు పంపించాలని కిరణ్ సూచించాడు. అయితే తాను ఫోన్ అమ్ముతున్నట్టు తన సోదరుడికి తెలియకూడదని షరతుపెట్టాడు. అనుకున్నట్టు ఓ యువకుడు ఐ ఫోన్ తీసుకొని వచ్చాడు. అది మంచి కండిషన్‌లో ఉండటంతో శంకర్ అగర్వాల్ కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపించాడు. ఈ మేరకు కిరణ్ ఇచ్చిన యూపీఐ ఐడీకి రూ.75 వేలు పంపించాడు. ఆ తరువాత నుంచి కిరణ్ ఫోన్ పనిచేయడం మానేసింది. వచ్చిన యువకుడిని అడగగా తనకు కిరణ్ అనే సోదరుడులేడని సమాధానం చెప్పాడు. అంతేకాకుండా ఐఫోన్‌కు అతనే అసలు యజమాని అని తేలింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి వినియోగిస్తున్న డెలివరీ బాయ్ అరెస్టు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి వినియోగిస్తున్న డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12లో నివాసముండే బి.వినయ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతను గంజాయి తాగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈనెల 5న అతను ఇంట్లో ఉండగా పోలీసులు దాడులు చేయగా 3.7గ్రాముల గంజాయి లభించింది. చింతల్‌బస్తీలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి రూ.300 కొనుగోలుచేసినట్టు తేలింది. వినయ్‌పై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్, గంజాయిని అరికట్టాలి : కమలాసన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయిని అరికట్టడంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. జనవరిలో ఎస్‌టీఎఫ్(స్టేట్ టాస్క్‌ఫోర్స్) బృందాల పనితీరుపై ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా జనవరిలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, డ్రగ్స్‌పై కలిపి 40 కేసులు నమోదు చేయడం అభినందనీయమని అన్నారు. నాలుగు ఎస్‌టీఎఫ్ టీమ్‌లు కలిసి ఎన్‌డీపీఎస్, ఎన్‌డీపీఎల్, గుడుంబా, అనాథరైజ్డ్ లిక్కర్, తాడి అడ్‌ల్ట్రేషన్‌లో నమోదు చేసిన 53 కేసుల వివరాలను ఆయన పరిశీలించారు. ఫిబ్రవరిలో గంజాయి, డ్రగ్స్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక దృష్టిపెట్టి ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. సమావేశంలో జాయింట్‌కమిషనర్ ఖురేషీ, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, అడిషనల్ ఎస్పీ భాస్కర్ ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్స్ అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ.. కారును ఢీకొన్న మరోకారు

మద్యంమత్తులో ఐదుగురు యువకులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ నుంచి తప్పించుకునేందుకు వేగంగా కారు నడుపుతూ మరో కారును ఢీకొట్టిన యువకులపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 10లో ఈ నెల 5న ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. యాప్రాల్‌కు చెందిన వీవీకే.సిద్ధార్థ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కారును పోలీసులు ఆపి శ్వాస పరీక్ష చేస్తున్నారు. ఇంతలో డ్రంకెన్ డ్రైవ్ నుంచి తప్పించుకునేందుకు ఓ కారు అతివేగంగా వచ్చి సిద్ధార్థ కారును ఢీకొట్టింది. దీంతో అతని కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతిన్నది. అప్రమత్తమైన పోలీసులు ప్రమాదానికి కారణమైన కారులో ఉన్న ఐదురుగు యువకులను అదుపులోకి తీసుకొని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. విచారణలో బాచుపల్లికి చెందిన పాలమాకుల మృదుల్, కుత్బుల్లాపూర్‌కు చెందిన రితుల కుమార్‌రెడ్డి, కోంపల్లికి చెందిన అజయ్ మంతెన, మేనేని అజయ్, జక్కుల వికాస్ అని తేలింది. వీరంతా మద్యం తాగినట్టు శ్వాస పరీక్ష ద్వారా తేలింది. నిందితులపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు.

ప్రియురాలిపై దాడి చేసిన జిమ్ ట్రైనర్ అరెస్ట్



కె.ప్రసాద్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): యువతిపై దాడిచేసిన కేసులో జిమ్ ట్రైనర్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. 'నాతో సహజీవనం చేస్తూ మరో యువతితో ప్రేమ నడుపుతున్నావని నిలదీసిన యువతిపై దాడిచేసిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రి



ఎలక్ట్రోలైట్ మెషిన్



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే మెషిన్

రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం



ఆస్పత్రిలోని రోగులకు మెరుగైన సేవలు అందించడానికి కృషిచేస్తున్నాం. సెంటర్‌ఫర్ ఎక్సెలెన్స్ భవన నిర్మాణం పూర్తయిన తర్వాత ఆస్పత్రిలో సర్వీసులు పెరుగుతాయి. రోగులకు కూడా అధునాతన సేవలు అందుతాయి. పీజీ సీట్ల పెంపుతో పాటు కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ క్లాసులు కూడా పెరుగుతాయి. ఆస్పత్రిలోని ఔట్ పేషెంట్ విభాగం, అడ్మినిస్ట్రేటివ్ విభాగం తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. రోగులకు కరెంటు షాక్ నిచ్చే ఆర్‌టీఎంఎస్ మిషన్, ఈఈజీ, ఈసీజీ మిషన్ల ద్వారా సేవలు అందిస్తున్నాం. ఆస్పత్రిలో మరిన్ని ఆధునిక సౌకర్యాల కోసం కృషి చేస్తున్నాం. అందులో భాగంగా అల్ట్రాసౌండ్ మిషన్ కూడా ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

- డాక్టర్. అనిత రాయిరాల, సూపరింటెండెంట్, మానసిక ఆస్పత్రి

కార్పొరేట్‌కు దీటుగా

ప్రభుత్వ వైద్యం

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో అధునాతన పరికరాలు

- రోగులకు సత్వర సేవలు
- ఇక అన్ని పరీక్షలూ ఇక్కడే...

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో రోగులకు అధునాతన వైద్యసేవలు అందిస్తున్నామని ఆస్పత్రి వైద్యులు తెలుపుతున్నారు. ఈ మధ్య కాలంలో ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య యంత్రాలను, కొన్ని పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో రోగులకు ఆస్పత్రిలో త్వరగా సేవలను డాక్టర్లు అందిస్తున్నారు. ఆస్పత్రిలోని స్టాఫ్ క్వార్టర్స్ ప్రాంతంలో ఫోరెన్సిక్ వార్డు అయిన మేల్ జైల్ వార్డును నిర్మించారు. కోర్టు ద్వారా ఆస్పత్రికి వచ్చిన రోగులను ఈ భవనంలో ఉంచుతారు. ఈ భవనానికి అధిక సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. నిత్యం రోగులను పర్యవేక్షిస్తున్నారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను కూడా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఆస్పత్రిలో సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ భవన నిర్మాణం పూర్తయితే ఇంకా రోగులకు మరిన్ని అధునాతనమైన సేవలు అందనున్నాయి.

పరీక్షల కోసం ఇతర ఆస్పత్రులకు వెళ్లే పనిలేదు

గతంలో ఆస్పత్రిలోని రోగులకు వివిధ రక్తపరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీల కోసం ఇతర ఆస్పత్రులైన ఛాతివ్యాధుల ఆస్పత్రి, ఉస్మానియా, గాంధీలకు పంపిస్తుండేవారు. కానీ ఈ మధ్యకాలంలో ఆస్పత్రిలో ఈసీజీ మిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మూడు సంవత్సరాల క్రితం రూ.6.5 లక్షల వ్యయంతో అధునాతన ఎక్స్‌రే మిషన్‌ను, ఆరు నెలల క్రితం అధునాతన పద్ధతిలో పనిచేసే సీటిస్కాన్ మిషన్‌ను, రక్తపరీక్షల కోసం హెమటాలజి విభాగంలో సీబీపీ, ఇతర పరీక్షలు చేయడానికి ఉపయోగించే రూ.5 లక్షల ఖరీదైన సెల్‌కౌంటర్ మిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. సాధారణంగా ఈ పరీక్షలను మ్యానువల్‌గా చేస్తే పూర్తి ఫలితాలు రావడానికి అరగంట కన్నా ఎక్కువగానే సమయం పడుతుంది. కానీ రక్త నమూనాలను ఈ మిషిన్‌లో ఉంచితే కేవలం ఒక నిమిషంలోనే ఫలితాలు వస్తాయి. అదేవిధంగా బయోకెమిస్ట్రీ విభాగంలో పరీక్షలు నిర్వహించేందుకు రూ.2లక్షల వ్యయంతో ఎలక్ట్రొలైట్స్ మిషిన్‌ను, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విభాగాలకు సంబంధించిన కొన్ని పరీక్షల కోసం ఇతర మిషిన్లను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం రోగులను పరీక్షల కోసం బయటికి పంపించకుండా ఆస్పత్రిలోనే చేసి, వేగంగా వైద్యం అందిస్తుండడంతో రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ భవనం

ఆస్పత్రిలో సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ భవన నిర్మాణం పూర్తయితే రోగులకు మరిన్ని అధునాతనమైన సేవలు అందే అవకాశాలున్నాయి. రూ.35 కోట్ల



ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన సిటీ స్కాన్ యంత్రం

వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవనంలో అన్ని అధునాతన సౌకర్యాలను పొందుపరిచేందుకు తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ పూర్తిస్థాయిలో కృషి చేస్తోంది. ఈ భవనం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉంటుంది. రెండు ఉభయ రాష్ట్రాల్లోని మానసిక ఆస్పత్రుల్లో రోగులకు ఈ భవనం నుంచే సేవలు అందుతాయి. భవన నిర్మాణం వల్ల మ్యాన్ పవర్ పెరగడంతోపాటు పీజీసీట్లు, సీఎంఈ కార్యక్రమాలు తదితర సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

రోగులకు పెరిగిన సౌకర్యాలు



మానసిక ఆస్పత్రిలో ముఖ్యంగా సిటీస్కాన్ మిషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామం. దీని ద్వారా రోగులకు అధునాతన సౌకర్యాలు అందుతున్నాయి. ఆస్పత్రిలో అధునాత ఎక్స్‌రే మిషిన్‌ను వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చే చేసింది. ఎక్స్‌రే మిషిన్‌ను ఏర్పాటుచేయక ముందు మొబైల్ ఎక్స్‌రే మిషిన్ ఉండేది. దాంతో ఎక్స్‌రేల్లో క్లారిటీ అంతగా ఉండేది కాదు. వాటితో కొన్ని ఎక్స్‌రేలు తీయడం సాధ్యమయ్యేది కూడా కాదు. ఈ అధునాతన ఎక్స్‌రే మిషిన్ ఏర్పాటైన తర్వాత అన్నిరకాల ఎక్స్‌రేలను తీస్తున్నారు. పైగా ఎక్స్‌రేలు కూడా క్లారిటీగా వస్తున్నాయి. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో ల్యాబొరేటరీలో అవసరమైన పరికరాలు అందుబాటులో లేక రోగులకు సరైనసేవలను అందించలేకపోయేవాళ్లం. కానీ ప్రస్తుతం ల్యాబొరేటరీలో బయోకెమిస్ట్రీ, ఎమటాలజీ, మైక్రో బయాలజీ విభాగాలకు చెందిన కొన్ని మిషిన్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రోగులకు సత్వర సేవలను అందిస్తున్నాం.

- జి. అర్జున్, రేడియోగ్రాఫర్

ఏఐ ఆవిష్కరణలతో మెరుగైన ఆరోగ్య సంరక్షణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోఇన్ఫర్మాటిక్స్ కీలకపాత్ర పోషిస్తున్నాయని కార్యోస్ బయో (కాలిఫోర్నియా)వ్యవస్థాపకుడు తిరునగరి శ్రీనివాస్ అన్నారు. 'హెల్త్‌కేర్ రంగంలో ఏఐ, బయో ఇన్ఫర్మాటిక్స్ గేమ్‌చేంజర్' అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఔషధాల కచ్చితత్వం, రోగనిర్ధారణ, చికిత్స వ్యూహాలను ఏఐ ఆధారిత ఆవిష్కరణలు రూపొందిస్తున్నాయని పేర్కొన్నారు. బయోఇన్ఫర్మాటిక్స్ ఆధారిత హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌లో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా నిలవాలంటే.. కోడింగ్, ఏఐ, డేటా సైన్స్‌లో నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని విద్యార్థులకు, పరిశోధకులకు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మల్టీ ఓమిక్స్ డేటా, డీప్ లెర్నింగ్, అధునాతన ఇమేజింగ్ టెక్నిక్‌లను ఏకీకృతం చేయడం ద్వారా, కార్యోస్ బయో సంస్థ బయోమార్కర్ డిస్కవరీలో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటేషనల్ అండ్ సిస్టమ్స్ బయాలజీ, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ తదితర విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

దివ్యాంగుల సంక్షేమానికి కృషి : సీతక్క

పంజాగుట్ట,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ప్రజాభవన్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ దివ్యాంగ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న దివ్యాంగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి సాంబశివరావు, గౌతమ్ నాగ్, పి.రాజు పాల్గొన్నారు

నులి పురుగులపై అవగాహన కల్పించాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నులి పురుగులపై పాఠశాలస్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి అధికారులకు సూచించారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 3,863 ప్రభుత్వ, ప్రైవేట్‌పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మదర్సాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాలు, కాలేజీల్లోని 1-19 ఏళ్ల పిల్లలు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డీఈఓ రోహిణి, సీఎంఓహెచ్ డాక్టర్ పద్మజ, అధికారులు ఆశన్న, కోటజీ పాల్గొన్నారు.



తొలి ఎలక్ట్రిక్ కారు ఇ-విటారాను ఆవిష్కరిస్తున్న మారుతీ సుజికి అధికారులు, వరుణ్ మోటార్స్ ప్రతినిధులు

'ఇ-విటారా' తొలి ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): మారుతి సుజికి తొలి ఎలక్ట్రిక్ కారును బంజారాహిల్స్‌లోని వరుణ్‌మోటార్స్-నెక్సా షోరూమ్‌లో గురువారం ఆవిష్కరించారు. ఇదే కార్యక్రమంలో 20 ఇన్‌విక్టో కార్లను యూరో క్యాబ్ సర్వీసెస్‌కు డెలివరీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతి సుజికి బిజినెస్ హెడ్ వినీత్ జైన్, రీజనల్ మేనేజర్ అమిత్‌కుమార్ సింగ్, జోనల్ మేనేజర్ సాహిల్ అరోరా, వరుణ్ గ్రూప్ డైరెక్టర్ డీకే రాజు, బ్రాంచ్ హెడ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ గ్రూపు-1లో 3 శాతానికి పెంచాలి'

పంజాగుట్ట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డికి, ఏక సభ్య కమిషన్ డాక్టర్ షమీమ్ అక్తర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని బేడ బుడగ జంగం-జన సంఘం అధ్యక్షుడు సిరిపాటి వేణు అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన పంబాల, మన్నె సామాజిక వర్గాలను వర్గీకరణ గ్రూపు 1లో నుంచి తొలగించాలని, తమకు మూడు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కె.నర్సింహ, రాష్ట్ర అధ్యక్షుడు కె.సహదేవుడు, సంఘం ఉపాధ్యక్షుడు పరుశురాం, కార్యదర్శి వెంకటి, రాజేష్, శివ, పి.కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మాదిగ మేధావుల ఫోరం ప్రతినిధులు

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట రూపం ఇవ్వాలి

- జీవోను అమలు చేసి, ఇప్పటికే ప్రకటించిన ఉద్యోగ నోటిఫికేషన్లకు వర్తింప చేయాలి

పంజాగుట్ట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట రూపం ఇచ్చి, జీవోను అమలు చేయాలని, ఇప్పటికే ప్రకటించిన ఉద్యోగ నోటిఫికేషన్లకు జీవోను వర్తింప చేయాలని మాదిగ మేధావుల ఫోరం ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్, ప్రతినిధులు ప్రొఫెసర్లు కాశిం, ఇటిక్యాల పురుషోత్తం, చారకొండ వెంకటేష్, మల్లేశం తదితరులు మాట్లాడారు. వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించినందుకు వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మాల మేధావులు, రాజకీయ నాయకులు, సంఘాలు మా పోరాటం అర్థం చేసుకుని సహకరించారని అన్నారు. భవిష్యత్‌లో రాబోయే పోరాటంలో ఇద్దరం ఒకటిగా ఉందామని, ఈ 30 సంవత్సరాల కాలంలో ఎవరి మనసును అయినా నొప్పించి ఉంటే క్షమాపణ కోరుతున్నాం అన్నారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు డాక్టర్ మద్దిలేటి, పి.వీరస్వామి, ప్రొఫెసర్ నేతానియల్,మేడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీ మనోహర్

కుట్ర పూరితమైన సర్వే, బీసీలకు వెన్నుపోటు

- అగ్రకుల రాజకీయ నాయకుల కుట్రలకు బీసీలు బలి
- సర్వే విషయంలో ప్రభుత్వం ఫెయిల్
- పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్, బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల సర్వే విషయంలో ప్రభుత్వం,లోపాలు ఎత్తి చూపడంలో ప్రతిపక్ష పార్టీలు విఫలం అయ్యాయని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్, బీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు ఆరోపించారు. సర్వే కుట్ర పూరితం, లెక్కలు, అంకెల గారడీ, బీసీలకు వెన్నుపోటు అని వారు అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కులగణన సర్వే, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు, ప్రభుత్వ ప్రకటనలో అస్పష్టత అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్లు కె. మురళీమనోహర్, సింహాద్రి, ఐ.తిరుమలి, ఫెడరేషన్ ప్రతినిధులు దేవల్ల సమ్మయ్య, సతీష్ కొట్టే, పృథ్వీరాజ్ యాదవ్, తదితరులు మాట్లాడారు. సర్వే పూర్తి చేస్తే బీసీ జనాభా పెరగాలి కానీ ఎలా తగ్గుతుందని వారు ప్రశ్నించారు. 2014 సమగ్రకుటుంబ సర్వేలో 51 శాతం ఉంటే ప్రస్తుతం 46 శాతం ఎలా అవుతుందని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడుకోవడానికే ఓసి జనాభా ఎక్కువ చూపారని అన్నారు.

నగరంలో సౌదీ నైట్స్ షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విలక్షణ కథనాంశంతో సౌదీ అరేబియా ఫిలిం కమిషన్ నిర్మించిన చిత్రాలను బంజారాహిల్స్‌లోని ఆర్కే పీవీఆర్‌లో ప్రదర్శించారు. సౌదీ అరేబియా, భారతదేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ మహ్మద్ మురారి తెలిపారు. నగరంతో పాటు బెంగళూరు, ముంబై పట్టణాల్లో ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్కీ మురాని, మజ్హర్ నడియాద్ వాలా, అలీ మురాని తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వార్తా పత్రికలు



మాట్లాడుతున్న దేవులపల్లి అమర్

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): డిజిటల్ మీడియా వినియోగం పెరగడంతో ప్రింట్ మీడియా ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటోందని మన తెలంగాణ సంపాదకులు దేవులపల్లి అమర్ పేర్కొన్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ.ఎస్.బషీరుద్దీన్ జయంతి సందర్భంగా వర్సిటీలో గురువారం స్మారకోపన్యాసం నిర్వహించారు. దేవులపల్లి అమర్ హాజరై 'ప్రింట్ మీడియా- సంక్షోభం, భవిష్యత్' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియా ఉపయోగం బాగా పెరిగిందని, దీంతో వార్తా పత్రికల సర్క్యులేషన్, ప్రకటనల ఆదాయం తగ్గడంతోపాటు, అనేక ప్రఖ్యాత పత్రికా సంస్థలు నిలదొక్కుకోవడానికి ఇబ్బంది పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్, సోషల్ మీడియా యుగంలో తప్పుడు వార్తల వ్యాప్తి పెరిగిందని, దీన్ని అరికట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పత్రికలు పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలి అంటే యాజమాన్యాల ధోరణి మారాలని, వ్యాపార దృష్టితో కాకుండా ప్రజల సమస్యల పరిష్కార కోణంలో పనిచేయాలని సూచించారు. యాజమాన్య వాటాలో పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు కాకుండా ప్రజలు చందాలు ఇచ్చి లాభాపేక్ష లేని వాటాదారులుగా ఉండాలని, అప్పుడే ప్రింట్ మీడియాను రక్షించుకునే అవకాశం ఉందని వివరించారు. అధ్యక్షత వహించిన వీసీ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సమాజాన్ని జాగృతం చేయడంలో మీడియా ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని, పాత్రికేయులు, మీడియా సంస్థలు సామాన్యులకు అండగా నిలవడంలో, ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంలో తమ పాత్రను పోషించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎల్.విజయ కృష్ణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్ అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ వాహనదారులపై చర్యలు తీసుకోండి : గిగ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, ఏపీకి చెందిన పలు వాహనాలు తెలంగాణలో అక్రమంగా తిరగడం కారణంగా టాక్సీ, యాప్ ఆధారిత సేవల్లో పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతోందని గిగ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు సలాఉద్దీన్ తెలిపారు. పన్నులు చెల్లించకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు తెలంగాణలో తిరగడం కారణంగా స్థానిక డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోతోందన్నారు. రవాణా శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేసి అనధికారిక వాహనాలను నడిపేవారిపై కఠినచర్యలు తీసుకోవాలని రవాణా శాఖ కమిషనర్‌ను కలిసి వినతి ప్రతం సమర్పించారు. అంతేకాకుండా ఐటీ సంస్థల్లో స్థానిక డ్రైవర్లకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



అడ్డగుట్టలో నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు

కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

● కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కార్యదర్శి సంగీత

అడ్డగుట్ట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) :ఐదేళ్ల క్రితం నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి సంగీత సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుకు సూచించారు. అడ్డగుట్టలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని పాత కమ్యూనిటీ హాల్‌ను కూల్చివేసి కొత్తగా నిర్మాణం చేసేందుకు పిల్లర్లు వేసి అర్ధాంతరంగా నిలిపివేశారని ఆమె తెలిపారు. దీంతో అధిక మొత్తాలు వెచ్చించి ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో శుభకార్యాలయాలు జరుపుకోవాల్సి వస్తోందని అడ్డగుట్టలోని పేదలు వాపోతున్నారన్నారు. అంతేకాకుండా రాత్రి సమయంలో కొందరు తాగుబోతులు కమ్యూనిటీ హాల్ స్థలంలో మద్యం తాగుతూ గోలగోల చేస్తున్నారని స్థానికులు చెప్పారనిసంగీత పేర్కొన్నారు. కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని సత్వరం పూర్తి చేయాలని సంగీత కోరారు. కమ్యూనిటీహాల్‌ను సందర్శించిన వారిలో సేవాదళ్ నాయకులు రామలీల, రవి, లక్ష్మణ్‌చారి, పద్మ, మేరీ ఉన్నారు.



వార్షికోత్సవం జరుపుకుంటున్న బోయిన్‌పల్లి బ్రాంచ్ సిబ్బంది

కిడ్డీ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు ఆదర్శ్ బ్యాంకులోని కిడ్డీ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని బోయిన్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ బ్రహ్మానందం అన్నారు. ది ఆదర్శ్ బ్యాంకు బోయిన్‌పల్లి శాఖ 27వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఖాతాదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపి బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతి ఖాతాదారు తమ చిన్నారులను చిన్ననాటి నుంచే బ్యాంక్‌లో డబ్బులు పొదుపు చేసుకొనేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కిడ్డీ బ్యాంక్ విధి విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ బ్యాంకు లావాదేవాలు 1,300 కోట్ల బిజినెస్ మైలురాయిని దాటిందని తెలిపారు. చిన్న, సన్నకారు, మధ్యతరగతి ప్రజలఅభివృద్ధికి నిరంతరం సేవలం దిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కె.బ్రహ్మానందం, అదనపు మేనేజర్ పడకంటి వెంకటేశం, శ్రావణి, కమలేష్‌కుమార్, ప్రియాంక, సుమ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో రైల్వేస్టేషన్లలో తాగునీరు అందించాలి

▸▸ రైల్వే వినియోగదారుల ప్రతినిధుల డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలన్ని దృష్టిలో ఉంచుకొని రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రైల్వే వినియోగదారుల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలాగే అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద ఎంపిక చేసిన స్టేషన్లలో ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ అధ్యక్షతన 71వ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ(డీఆర్‌యూసీసీ) సమావేశం జరిగింది. 12 మంది నామినేటెడ్ సభ్యులతోపాటు అదనపు డివిజనల్ రైల్వేమేనేజర్ ఎంఎ రెహమాన్ పాల్గొన్నారు. రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు మెరుగుపర్చడంతో పాటు ప్రయాణికుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి తీసుకున్న చర్యలను డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ ఈ సందర్భంగా వివరించారు. అలాగే నూతన రైళ్లను నడపడంతో పాటు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించినట్టు తెలిపారు.

ఏఐ ఆవిష్కరణలతో మెరుగైన ఆరోగ్య సంరక్షణ

● కార్యోన్ బయో వ్యవస్థాపకుడు తిరునగరి శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోఇన్ఫర్మాటిక్స్ కీలకపాత్ర పోషిస్తున్నాయని కార్యోన్ బయో (కాలిఫోర్నియా)వ్యవస్థాపకుడు తిరునగరి శ్రీనివాస్ అన్నారు. 'హెల్త్‌కేర్ రంగంలో ఏఐ, బయో ఇన్ఫర్మాటిక్స్ గేమ్‌చేంజర్' అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఔషధాల కచ్చితత్వం, రోగనిర్ధారణ, చికిత్స వ్యూహాలను ఏఐ ఆధారిత ఆవిష్కరణలు రూపొందిస్తున్నాయన్నారు. అలాగే, వ్యాధులను ముందుగానే గుర్తించడం, వ్యక్తిగత ఆరోగ్య సమస్యలకు సరైన పరిష్కారాలను చూపడంలో అవి కీలకంగా మారాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటేషనల్ అండ్ సిస్టమ్స్ బయాలజీ, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ తదితర విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నులి పురుగులపై అవగాహన కల్పించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నులి పురుగులపై పాఠశాలస్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి అధికారులకు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల శారీరక ఎదుగులకు సంబంధించి డీవార్మింగ్ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈనెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం రోజున జిల్లాలోని 3,863 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మదర్సాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాలు, కాలేజీల్లో చదువుతున్న 1-19 ఏళ్ల పిల్లలు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని తెలిపారు. పాఠశాలల్లో ప్రార్థన సమయంలో నులి పురుగులపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, డీఈఓ రోహిణి, సీఎంఓహెచ్ డాక్టర్ పద్మజ, జిల్లా అధికారులు ఆశన్న, కోటజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్ తదితరులు

ఎస్సీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

● ప్రొ. గాలి వినోద్‌కుమార్

తార్నాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించి జనాభా దామాషా ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 9 శాతం రిజర్వేషన్లను స్వాగతిస్తున్నామని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్ కుమార్ అన్నారు. గురువారం తార్నాకలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ మాత్రమే ఇస్తే మాదిగలకు న్యాయం జరిగిందన్న మందకృష్ణ మాదిగ.. ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలకు 9 శాతం ఇచ్చినా అన్యాయం జరిగిందనడం సరికాదన్నారు. ఇప్పటికైనా మాల, మాదిగ సోదరులు ఘర్షణలు పడకుండా ఐక్యమత్యంతో రాజ్యాధికారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పచ్చదనం.. ఆహ్లాదం

● చిన్నారులకు ఆట పరికరాలు, స్కేటింగ్ మైదానం
● వ్యాయామ మైదానం, స్పోర్ట్స్ కోర్టు
● సందర్శకులను ఆకట్టుకుంటున్న మహేంద్రహిల్స్ కాలనీ పార్కు

మారేడుపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎటుచూసినా పచ్చదనం.. వాటర్ పాల్స్.. చిన్నారుల కోసం ఆట పరికరాలు.. స్కేటింగ్ మైదానం.. విశ్రాంతి స్థలాలు.. ఇలా అన్ని సౌకర్యాలతో సందర్శకులను ఆకట్టుకుంటోంది కంటోన్మెంట్ బోర్డు పరిధి మహేంద్రహిల్స్‌లోని పార్కు. ఎకరం విస్తీర్ణంలో దాదాపు 6.5 కోట్ల రూపాయలు వెచ్చించి ఈ పార్క్‌ను ఏర్పాటు చేశారు. గతేడాది నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ పార్కు.. మహేంద్ర హిల్స్ కాలనీ వాసులతో పాటు సమీపంలోని మరో 10 కాలనీల ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందిస్తోంది.



పార్కులోని గ్రీనరీ



స్కేటింగ్ గ్రౌండ్

స్వచ్ఛమైన గాలి..


ధనికులు నివాసముండే మహేంద్రహిల్స్‌లో రూపుదిద్దుకున్న ఈ పార్కులోని స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించడానికి ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది సీనియర్ సిటిజన్స్, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వస్తుంటారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇక్కడ అరుదైన విభిన్నమైన ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. పిల్లల కోసం ఉయ్యాలలు, జారుడు బల్లలు, చిన్నారుల వయస్సు తగినట్లుగా ఆట వస్తువులను ఇక్కడ ఏర్పాటు చేశారు. అలాగే, స్కేటింగ్ గ్రౌండ్, ఓపెన్ జిమ్, వ్యాయామ మైదానం, స్పోర్ట్స్ కోర్టు, మెడిటేషన్ హాల్, ఆడిటోరియం, విశ్రాంతి స్థలాలు ఉన్నాయి. పార్కులో ఉన్న వివిధ రకాల మూలికల చెట్లు, పూల చెట్లు, చూడముచ్చటైన బుద్ధుని విగ్రహం, వాటర్ పాల్స్, పార్కుకు వచ్చేవారిని కట్టిపడేస్తాయి.

పార్కు ఏర్పాటు ఓ ఘనత



మహేంద్రహిల్స్‌లోని పలు కాలనీల్లో పార్క్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగా కబ్జాకు గురైన భూమిని సేకరించి, అనేక భూవివాదాలను సామరస్యంగా పరిష్కరించాం. బోర్డు పరిధిలోని మహేంద్ర హిల్స్‌లో అతి పెద్ద పార్కును నిర్మించేందుకు శ్రీకారం చుట్టాం. ఒక ఎకరం స్థలంలో దాదాపు 6.5 కోట్ల రూపాయల వ్యయంతో పార్క్‌ను అతి సుందరవందనంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఈ పార్కు ఏర్పాటు ఓ ఘనత. నా హయాంలో రూపుదిద్దుకోవడం నాక ఒక తీపి జ్ఞాపకంగా ఉంటుంది.

- జె.రామకృష్ణ,కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్



పార్కులో సేద తీరుతున్న వృద్ధుడు



ఓపెన్ జిమ్‌లో మహిళల వ్యాయామం

ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దు

పద్మారావునగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇబ్బందులు కల్గించొద్దని, అధికారులు మానవతా ధృక్పదంతో వ్యవహరించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నా రు. బన్సీలాల్‌పేట డివిజన్ పద్మారావునగర్ పార్కు వద్ద రూ. 12.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులు, వెంకటాపురం కాలనీలో రూ. 42 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, ఎన్‌టీఆర్ విగ్రహం సమీపంలోని పార్కులో చేపట్టనున్న అభివృద్ధి పనులను గురువారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా రెడ్డి, కోట నీలిమతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫుట్‌పాత్, వీధి వ్యాపారులందరూ నిరుపేదలని, వారి పట్ల మానవతా ధృక్పదంతో మెలగాల్సి ఉందన్నారు. అయితే, కొందరు అధికారులు వారిని ఇబ్బందులకు గురి చేస్తూ ఉపాధి లేకుండా చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులు తమ విధానాన్ని మార్చుకోకపోతే ఫుట్‌పాత్ వ్యాపారులకు మద్దతుగా తాను పోరాటం చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. గత పదేళ్లుగా తాను ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు అనేక అభివృద్ధి పనులను చేపట్టానని తెలిపారు.



పద్మారావునగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్,తదితరులు.

కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డీసీ సమ్మయ్య, డీఈ ఆంజనేయులు, జలమండలి అధికారి ఆశీష్, స్ట్రీట్‌లైట్స్ ఏఈ అనూషతో పాటు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, వెంకటేశన్‌రాజు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సర్వే తప్పుల తడక.. మళ్లీ నిర్వహించాలి : ఎమ్మెల్యే తలసాని

పద్మారావునగర్,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే తప్పుల తడకని, సర్వేను తిరిగి నిర్వహించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బన్సీలాల్‌పేట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 సంవత్సరంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కలకు, 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సర్వే లెక్కలకు భారీ వ్యత్యాసం కనపడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సర్వేలో 3,54,77,544 మంది పాల్గొనగా, 16 లక్షల మంది తమ వివరాలు ఇచ్చేందుకు నిరాకరించి సర్వేలో పాల్గొనలేదని అధికారిక లెక్కల్లో ప్రకటించారని తలసాని గుర్తు చేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024లో రాష్ట్ర జనాభా 3,70,77,554 ఉన్నట్లు ప్రకటించారని, కాలం గడచినా జనాభా పెరగాల్సింది పోయి 62,84,268 మంది తగ్గారని, వారంతా ఎటుపోయారో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేసిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ తన మద్దతు ఇది వరకే ప్రకటించిందని గుర్తు చేశారు. వర్గీకరణలో ఉప కులాల సంఖ్యాపరంగా వారికి న్యాయంగా రావాల్సిన రిజర్వేషన్ శాతాన్ని అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని తలసాని అన్నారు.

మంత్రులను కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం సభ్యులు గురువారం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రులను విడివిడిగా కలిసి మార్కెట్ కమిటీలో తమకు అవకాశం కల్పించినందుకు చైర్మన్ ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ దేవేందర్‌తో పాటు సభ్యులు మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రులకు వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి వెంకన్న, మార్కెట్ పాలకవర్గం సభ్యులు ప్రభాకర్, సాయిశరత్, సంతు, జూలియస్, నల్లోల రాజేందర్, కృష్ణారెడ్డి, దుర్గేష్ గౌడ్, ఆకాష్ రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు

ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి సరఫరా

● రైల్లో తరలిస్తుండగా సికింద్రాబాద్ స్టేషన్‌లో పట్టివేత ● 7.8 కిలోల 'సరుకు పట్టివేత ● నిందితుడి అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు రైలులో గుట్టుచప్పుడు కాకుండా సరఫరా చేస్తున్న 7.842 కిలోల గంజాయిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావిద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన అబల్ (23) వ్యవసాయ కూలీ. కూలీ పని ద్వారా వచ్చే సంపాదన కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించే మార్గాల కోసం అన్వేషిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం అబల్ అడవా పట్టణానికి వెళ్లిన సమయంలో రినో అనే వ్యక్తి పరిచయమయ్యాడు. మహారాష్ట్రలో గంజాయికి మంచి డిమాండ్ ఉందని, గంజాయిని విక్రయిస్తే సులభంగా డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపాడు. దీంతో రినో వద్ద నుంచి అబల్ 8 కిలోల గంజాయి ప్యాక్ రూ. వెయ్యి చొప్పున కొనుగోలు చేశాడు. గంజాయి తీసు అబల్ అటవీ ప్రాంతం నుంచి వస్తుండగా, మాసియా (60) అనే వృద్ధుడితో పరిచయం ఏర్పడింది. మాసియాకు కొంత గంజాయిని విక్రయించి ఫోన్ పే ద్వారా తన అకౌంట్‌లో డబ్బు వేయించుకున్నాడు. మిగతా గంజాయిని తీసుకొని ఈనెల 5న ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో ఎక్కి గురువారం సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నాడు. సాధారణ తనిఖీల్లో భాగంగా రైల్వే పోలీసులు అప్పుడే స్టేషన్‌లో ఆగిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లోనూ తనిఖీలు చేపట్టారు. జనరల్ బోగీలో అబల్ వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా రూ 1.96 లక్షల విలువ చేసే 7.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా, రినో, మాసయా అనే మరో ఇద్దరూ కూడా ఈ గంజాయి దందాలో ఉన్నారని తేలింది. వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.



నిందితుడిని, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న రైల్వే పోలీసులు

ప్రభుత్వ భూమి కబ్జా

● మట్టిని నింపుతున్న టిప్పర్లను సీజ్ చేసిన అధికారులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం ప్రాంతంలో భూ కబ్జాదారులు మళ్లీ బరితెగిస్తున్నారు. కొంత కాలం స్తబ్దుగా ఉన్నా స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలతో సర్వే నంబర్ 307లో భూ కబ్జాలకు తెరలేపారు. గురువారం రాత్రి ప్రభుత్వ భూమిలో టిప్పర్లతో మట్టి నింపుతుండగా స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా మట్టి నింపుతున్న ఏడు టిప్పర్లను గుర్తించారు. జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఏడు టిప్పర్లను సీజ్ చేసి, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. సూపర్‌వైజర్ ప్రదీప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో మట్టిని నింపుతున్నట్టు పోలీసులన్నారు. వీరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



పద్మారావునగర్ ప్రాంతంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కోట నీలిమ

కాంగ్రెస్‌తో అభివృద్ధి సాధ్యం: డాక్టర్ కోట నీలిమ

పద్మారావునగర్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు చేయడం కాంగ్రెస్ పార్టీకి మాత్ర మే సాధ్యమని ఆ పార్టీ సనత్‌నగర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. గురువారం ఆమె బన్సీలాల్‌పేట డివిజన్ పద్మారావునగర్ పరిసరాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజల పార్టీ అని, తమ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.5 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ఆమె వెంట వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



గన్‌బజార్‌లో పర్యటిస్తున్న టీఎన్ శ్రీనివాస్

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి : టీఎన్ శ్రీనివాస్

సికింద్రాబాద్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. కంటోన్మెంట్ రెండోవార్డు గన్‌బజార్‌గ్రౌండ్‌ను గురువారం ఆయన సందర్శించారు. గతంలో గ్రౌండ్ పరిసరాల్లో విద్యుత్ తీగలు ఉండేవని, పిల్లలు ఆడుకునేటప్పుడు బాల్ తగిలి నిప్పు రవ్వలు వచ్చేవని అన్నారు. ఈ విషయాన్ని తాము విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, తీగల స్థానంలో బంచ్ కేబుల్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. సమస్య పరిష్కారానికి సహకరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి కథనం ప్రకారం.. 40 ఏళ్ల వయస్సు గల ఓ వ్యక్తి గురువారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనారోగ్యంతో ప్రయాణికుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫారం నం. 6లో ఓ ప్రయాణికుడు మృతి చెంది ఉన్నట్టు తోటి ప్రయాణికుల ద్వారా రైల్వే పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం